కథా నిలయం
శ్రీకాకుళం

# వేలు

వసంత ఋతువులోని తేనెపట్టులా దసరా పండగ ముందు బజారు బాగా రద్దీగా ఉంది. ధరలు మండుకుపోతున్నా, కొనేవాళ్ళు కొంటూనే వున్నారు, అమ్మేవాళ్ళు అమ్ముతూనే వున్నారు సరుకులు. రాత్రి తొమ్మిది గంటలు దాటింది. జనం రద్దీ తగ్గుముఖం పట్టింది. షాపులు అలసట తీర్చుకుంటున్నాయి. సేట్ రాజలింగం ఒకసారి గడియారం చూసి, "ఒరేయ్! ఆ చీరలు, తానులు సర్దెయ్యండిరా. పదికావస్తూది" అన్నాడు పనివాళ్ళ నుద్దేశించి. పనివాళ్ళు యింటికి పోవాలన్న హడావిడిలో క్షణాలమీద చెల్లాచెదురుగా పరిచివున్న చీరల్ని, బట్టల తానుల్ని చక్కగా మడతలు పెట్టి బీరువాల్లో సర్దేశారు. గిరాకీ బాగా తగ్గుముఖం పట్టడంతో అలవాటు ప్రకారం ఫానులన్నీ కట్టేశాడు రాజలింగం.

"లెక్క టాలీ అయిందా?" అన్నాడు రాజలింగం పెద్దగుమాస్తా రామదాసు నుద్దేశించి.

"ఆఁ అయిందండి. మొత్తం ఈ రోజు సేల్స్ ఆరువేల ఎనిమిది వందలు' అంటూ నోట్లకట్టల్ని సేట్ రాజలింగం ముందు ఉంచాడు సేట్ రాజలింగం ఆ డబ్బును లెదర్ బేగ్‌లో పెట్టుకుంటూ 'రెపొద్దున్న నువ్వు బొంబాయికి బయలుదేరు. పండుగ ఇంకా నాలుగైదు రోజులుంది.

ఆ తరువాత దీపావళికూడా వుంది. అప్పుడే మన షాపులో సరుకులో వెరైటీలు తగ్గిపోయాయి' అన్నాడు.

'ఈ వారం పొడుగునా బేరం బాగా సాగింది కదండీ' అన్నాడు రామదాసు.

'అందుకే రేపు బొంబాయికి వెళ్ళి కావలసిన వెరైటీలుకొని వెంట తీసుకొచ్చేయి. ఎక్కువగా టెరిలీన్లు, టెరికాట్ లు, నైలెక్స్లూను ఈ రోజులలో కావలసినవి. కంచిపట్టుచీర, బెనారస్, ధర్మవరం-వీటికి గిరాకీ లగ్గసరి రోజుల్లో. కాని పండుగలకి అంతగా వుండదు.'

'నిజమేనండి. ఇప్పుడు స్ట్రెచిలాన్, టెరిలీన్, టెరికాట్, నైలెక్స్లకే డిమాండు. అవే ఎక్కువగా తెస్తాను. ఏభై ఏళ్ళు పైబడిన వాళ్ళకూడా వీటికే ఎగబడుతున్నారు.'

'అంతే మరి. కాలాన్నిబట్టి, అభిరుచులూ మారుతూ ఉంటాయి.'

'మీ అభిరుచిలో మాత్రం మార్పులేదు కదా! దాదాపు పాతికేళ్ళ క్రితం నేను మీ షాపులో పని కుర్రాడిగా చేరిన నాడు తమరు యేం కడుతున్నారో ఈనాడూ అదే. ఆ బెంగళూర్ సిల్కులాల్చీ, గ్లాస్కోపంచీ భుజంమీద బిళ్ళమడత కండువా' అన్నాడు రామదాసు.

'సర్లే. నీలోమాత్రం ఏం మార్పుంది. ఆ రోజులలో నిక్కరు, బనియను కట్టేవాడివి. ఇప్పుడు ఆ ముతక పంచి, హాఫ్ చేతుల ఖద్దరు చొక్కా——అంతేగా' అన్నాడు రాజలింగం నవ్వుతూ.

'తాహతు మరిచిపోయి పరుగెడితే ఎలా చెప్పండి?' అన్నాడు రామదాసు వినయంగా.

'అదిసరే, నాతో ఇంటికి రా. నీకు డబ్బు యిస్తాను. తీసుకెడుదువుగాని. ఉదయాన్నే రైలుకి నువ్వెళ్ళిపోవచ్చు. మళ్ళీ షాపుకి రానక్కరలేకుండా' అంటూ రిక్షా ఎక్కాడు రాజలింగం, రామదాసు షాప్ తలుపులు మూసి యిచ్చిన తాళాలు అందుకుంటూ రిక్షా వెళ్ళిపోయింది.

వెనకనే రామదాసు సేట్ రాజలింగం యింటికి కాలినడకని బయలుదేరాడు. రాజలింగం ఒక్కడే రిక్షాలో వెడుతూన్నా, రామదాసుని తనతో బాటు రిక్షా ఎక్కమనలేదు. ఆ అలవాటు అతనికి మొదటి నుంచీలేదు.

రామదాసు రాజలింగం బట్టలషాపులో అతని పన్నెండో ఏటో పదమూడో ఏటో పనికుర్రాడుగా చేరాడు. వచ్చిన కస్టమర్లకి కూల్ డ్రింకులు, కాఫీలు తేవడం, కుంచె పట్టుకుని అద్దాల బీరువాలకి పట్టిన దుమ్ము రోజూ దులపడం, షాపు ముందు నీళ్ళు చల్లడం-ఇలాంటి పనులు చేసేవాడు ఆ రోజుల్లో. క్రమేపీ వయసుతోబాటు హోదాకూడా పెరిగింది. బట్టల తానులు మడతపెట్టడం, వచ్చిన కొనుగోలుదారులకి బట్టలు తీసి చూపించడం దాకా వచ్చాడు రామదాసు. రాజలింగం షాపు బాగా పెరిగింది. మొదటినుంచి ఆ పట్టణంలో ఆ షాపే పెద్దదని పేరున్నా, పట్టణం పెరగడంతోబాటు షాపూ పెరిగింది. షాపులోవున్న రామదాసూ పెరిగాడు. షాపు యజమాని రాజలింగంకూడా పెరిగాడు. అంతా పెరుగుదలేగాని, తేడా ఒక్కటే. రాజలింగం లక్షరూపాయల విలువచేసే బట్టల షాపు పదిలక్షలకి పెరిగితే, రామదాసు పదిహేను రూపాయల జీతం నూటయాభై కి పెరిగింది. రాజలింగానికి వున్న డబ్బుని, వచ్చిన ఆదాయాన్ని దాచుకోవడం ఇబ్బందిగావుంటే, రామదాసుకి వచ్చే ఆదాయంలో బతకడం ఇబ్బందిగా వుంది. ఎవరి ఇబ్బందులు వాళ్ళవి.

రాజలింగం ఇల్లుచేరిన పదిహేను నిమిషాలకి రామదాసుకూడా రాజలింగం యింటికి చేరాడు. రాజలింగం భోజనంచేసి, యాభై వేలు పట్టుకొచ్చి లోపలినుంచి బాగ్‌లోపెట్టి రామదాసుకి అందించాడు 'జాగ్రత్త' అంటూ.

'ఎంతండీ?'

'ఏభై. డ్రాఫ్ట్ తీయడానికి టైములేదు. జాగ్రత్తగా పట్టుకెళ్ళు' అని చెప్పి, రామదాసుని సాగనంపాడు రాజలింగం.

రామదాసు ఇల్లు చేరుకొని భోజనం చేశాడు. పక్కమీద నడుం వాలుస్తూ, 'పిల్లలంతా పడుకున్నారా' అన్నాడు. అది అతను రోజూ అనే రివాజు మాటే.

'ఆఁ పదకొండు కావస్తూంటే ఇంకా మెలకువగా వుంటారా?' అంది రామదాసు భార్య జానకమ్మ. అతని పక్కనే కూర్చుంటూ.

'అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. నా బెడ్డింగు సర్దు. ఓ రెండు జతల బట్టలు వెయ్యి చాలు. పొద్దున్నే బొంబాయి వెళ్లాలి' అన్నాడు.

'బట్టల ఖరీదుకా? నెల క్రితమేగా వెళ్ళొచ్చారు? మళ్ళీ అంత తొందర్లోనా?'

'గిరాకీ అలా వుంది.'

'ఈసారికూడా ఓ అరడజను జాకెట్ పీసులు తెచ్చి పెట్టండి' అంది జానకమ్మ కాస్త గోముగా.

'మొన్న వెళ్ళినప్పుడే కదే నాలుగు పీసులు తెచ్చాను. జాకెట్ పీసులు జాకెట్లు కుట్టించుకుంటున్నావా నమిలి మింగేస్తున్నావా?' అన్నాడు రామదాసు కాస్త చిరాగ్గా.

'ఆ పీసు లసలు నే కుట్టించుకోనే లేదండీ. మన ఇరుగు పొరుగు ఆడవాళ్ళు బాగున్నాయ్, బాగున్నాయ్ అని ముచ్చట పడితే వాళ్ళకి నాకు తోచిన ఉజాయింపు ధరకి అమ్మేశాను' అంది జానకమ్మ తన తప్పేమీ లేదన్నట్టు.

'ఎలా అమ్మావ్ ?'

'పీసు ఆరు రూపాయల లెక్కని అమ్మేశాను.'

రామదాసులో ఏదో ఆలోచన చటుక్కున మెరిసింది,

'ఇంకా తెస్తే అమ్మగలవా ?' అన్నాడు.

'ఎందు కమ్మలేను. ఎంతో మంది కావాలన్నారు అలాంటి పీసులు అందుకే అరడజను తెమ్మన్నాను ఈ సారి' అంది జానకమ్మ

రామదాసు బొంబాయి వెళ్ళి కావలసినవన్నీ ఖరీదు చేశాడు. చివరికి అయిదు వందల రూపాయల జాకెట్ పీసులు తీసుకొని అరువు వ్రాయించాడు. ఏభై వేల రూపాయల సరుకు కొన్న ఆసామీ కావడంతో అయిదు వందల రూపాయల అరువు పుట్టడం పెద్ద కష్టమైన పనేమీకాదు. మళ్ళీ వచ్చినప్పుడు ఇస్తానని చెప్పి, సరుకు పట్టుకొని బయలుదేరి వచ్చేశాడు రామదాసు. జాకెట్ పీసులు ఇంట్లో పడేశాడు. మిగిలిన సరుకు రాజలింగం షాపుకి చేర్చాడు.

అలా రామదాసు ఇంటి దగ్గర జానకమ్మ ఆధ్వర్యాన చిన్నబట్టల దుకాణం వెలిసింది. రెండు మూడేళ్ళలో దాదాపు పదివేలదాకా చేపట్టాడు రామదాసు. అయినా, యిదివరకటి అణుకువతోటే రాజలింగం షాపులో పనిచేస్తున్నాడు. అతనిలో ఏ మార్పులేదు. కాని, మనసులో ఏదో ధైర్యం, ఓ రకమైన తృప్తి చోటు చేసుకున్నాయి.

డబ్బు 'ముందు నువ్వు నన్ను పెంచూ ఆ తరవాత నా అంతట నేనే పెరుగుతాను, ఆ తరువాత నిన్నుకూడా పెంచుతాను' అంటుందట. అలాగే జరిగింది. పదివేలు పదివేలు దగ్గరే ఆగిపోలేదు. పదివేలు పదిహేను వేలు, ఇరవై వేలు కావడానికి ఆట్టే కాలం పట్టలేదు.

రామదాసు ఇంటిదగ్గర చిన్న బట్టలషాపు వెలసినట్టు రాజలింగం చెవిని పడటానికి ఆట్టేకాలం పట్టలేదు. కాని! రాజలింగం పట్టించుకోలేదు. దానికి కారణం — 'గాదికింద ఎలుక గాదికిందే బతుకుతుంది' అనే సామెతకి చెందిన మనిషికాదు రామదాసు. రామదాసు చాలా నిజాయితీ గల మనిషి. అతనిలో ఏదోషాన్ని వేలెత్తి చూపడం కష్టం. అందుకే రాజలింగం మెదలకుండా వూరుకున్నాడు. కాని, లోలోపల ఏదో దుగ్ధ బయలుదేరింది రాజలింగానికి. దుగ్ధ వున్నా 'మర్రిచెట్టుకింద మొలక లేస్తే మాత్రం ఎన్నాళ్ళు నిలుస్తుందిలే' అన్న ధైర్యం అతనికి ఉపశమనాన్ని యిచ్చింది. ఏదోరోజున ఈ షాపులోనే ఓ అర్ధణా వాటాయో, అణా వాటాయో యిస్తే, ఇంకా మొలక పెరగదులే అనుకున్నాడు కూడా

రాజలింగం. కాని, తనంతట తాను తనదగ్గర పనికుర్రాడుగా చేరిన వాణ్ని వాటాదారుడుగా చేసుకోవడమూ అన్న అహం అడ్డురావడంతో ఆ ప్రస్తావనకి వాయిదావేస్తూ వచ్చాడు రాజలింగం.

ఉన్నట్టుండి మూడురోజులు శెలవుపెట్టాడు రామదాసు. రామదాసు లేకపోతే రాజలింగానికి చెయ్యి విరిగిపోయినట్టు వుంటుంది. పేరుకి రాజలింగం బట్టలషాపు కాని, చూసేది. చేసేది షాపుని నడిపేది, లాభాలు తెచ్చిపెట్టేది అంతా రామదాసే. రాజలింగానికి రామదాసు బాధ్యత వహించడం వచ్చాక పని అలవాటుకూడా తగ్గిపోయింది. పిల్లలున్నారు గాని వాళ్ళెవరికీ ఈ షాపు వ్యవహారాల్లో తరిఫీదు లేదు. జులాయిగా తిరగడం, చేతికి దొరికినంతమట్టుకు తగలెయ్యడమే వాళ్ళకి అలవాటు.

నాలుగోరోజున రామదాసు వచ్చాడు. షాపుకి వెళ్ళలేదు. రాత్రి సరాసరి ఇంటికే వెళ్ళాడు రాజలింగాన్ని కలవాలని. రాజలింగం రామదాసుని తిన్నగా లోపలికి రమ్మన్నాడు. తన మంచంపక్కనే వున్న కుర్చీ చూపిస్తూ 'అలా కూర్చో' అన్నాడు.

ఇంతవరకు రామదాసు ఆగదిలోకి అడుగుపెట్టలేదు. అతనిముందు అతనియింట్లో కుర్చీలో కూర్చోనూ లేదు.

'ఫరవాలేదు లెండి' అని నిలబడ్డాడు రామదాసు.

"అదేమిటోయ్ ? పరాయివాడిలా అలా నిలబడతావ్, కూర్చో" అని బలవంతం చేశాడు రాజలింగం.

కూర్చోక తప్పలేదు రామదాసుకి.

"ఆడబోయిన తీర్థం ఎదురైంది. అడిగేస్తే పోతుంది. అడగడమేమిటి ? వాటా యిస్తానంటే కాదంటాడేమిటి, ఎగిరి గంతేసి ఒప్పుకుంటాడు" అనుకున్నాడు రాజలింగం.

"తమతో ఓ చిన్నవిషయం చెప్పి, ఓ కోరిక కోరాలని వచ్చాను" అన్నాడు రామదాసు,

రాజలింగం నవ్వుకుని, "ఏమిటది?" అన్నాడు.

"నేను మనరోడ్డులోనే చిన్న బట్టలషాపు తెరుస్తున్నాను. ఎల్లుండి మంచిది, మీరొచ్చి ప్రారంభోత్సవం చెయ్యాలి. నన్ను పైకితెచ్చింది మీరు, అందుకు ఈపని మీ చేతిమీదుగానే జరగాలని నా కోరిక" అన్నాడు రామదాసు సిగుపడుతూ.

"మర్రిచెట్టు కింద మొలిచిన మొక్క మాను కడుతోందన్న మాట" అనుకున్నాడు రాజలింగం. తనలోని ఆలోచనను తనలోనే దాచుకున్నాడు. "షాపు తీసుకున్నావా ?" అనిమాత్రం అడిగాడు.

"తీసుకున్నానండి. పగిడీ పదివేలు యిచ్చాను."

"సరే, వస్తాను, ఎల్లుండన్నావు కదూ ?"

"నేనే వచ్చి తమర్ని తీసుకెడతాను."

"అలాగే." మాటలు ముక్తసరిగా నడుస్తున్నాయి.

"జానకిరామ్ టెక్స్టోరియం"కి రాజలింగం చేతుల మీదుగా, రాజలింగం షాపుకి నాలుగు కొట్లు అవతల ప్రారంభోత్సవం జరిగింది.

రామదాసు కస్టమర్స్‌కి చూపే వినయ విధేయతలు, మంచితనం, సరసమైన ధరలు 'జానకిరామ్ టెక్స్టోరియం'ని తక్కువ కాలంలోనే పైకితెచ్చాయి. ఫోన్ వచ్చింది. రంగురంగుల ఫ్లోరసెంట్ దీపాలు వచ్చాయి. ఆ షాపుకి గిరాకీ పెరిగింది. రాజలింగం షాపుకి గిరాకీ తగ్గుముఖం పట్టింది.

ఓరోజు రామదాసుకి ఏదో డబ్బు అవసరమై రాజలింగం షాపుకి ఫోనుచేసి, రాజలింగాన్ని 'ఓ మూడువేలుంటే సర్దగలరా ? సాయంత్రం పంపిస్తాను మళ్ళీ' అన్నాడు రామదాసు ఫోన్‌లో. ఇచ్చి పుచ్చుకోవడం వ్యాపార సరళే.

కాని, రామదాసు తనకి ఫోన్‌చేసి అడగడం రాజలింగానికి గుండెల్లో గునపం దింపినట్టనిపించింది. 'నన్నే వెక్కిరిస్తున్నాడన్న మాట' అనుకున్నాడు. 'సరే, పంపించు ఎవర్నైనా' అని ఫోన్ పెట్టేశాడు. తనమాటకి రాజలింగం ఇస్తున్న విలువకు రామదాసు లోలోన

మురిసిపోయాడు. అన్నమాట ప్రకారం తీసుకున్న మూడువేలూ ఆరోజు సాయంత్రమే తిరిగి పంపించేశాడు,

ఆ మర్నాడు రాత్రి పదిగంటలవేళ రాజలింగం తిన్నగా షాపు మూసి రామదాసు యింటికి వెళ్ళాడు. రెండు గదులు, వసారా. అదె కొంప. తలుపు తట్టాడు. భోజనం చేస్తున్న రామదాసు, రాజలింగం గొంతు వినగానే ఉలిక్కిపడి లేచి చెయ్యేనా కడుక్కోకుండా వెళ్ళి తలుపు తెరిచాడు. ఎక్కడ కూర్చోమనాలో తోచక తబ్బిబ్బయ్యాడు, రాజలింగమే అక్కడ వున్న ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"బాబుగారికి మజ్జిగ తీసుకొచ్చి ఇయ్యి" అన్నాడు జానకమ్మతో రామదాసు,

"పిల్లలంతా పడుకున్నారా?" అన్నాడు రాజలింగం నాందిగా.

"అవునండి" అంది జానకమ్మ మజ్జిగ గ్లాసు అందిస్తూ.

మజ్జిగ తాగుతూ, "ఎక్కడా కనిపించడమే మానేశావ్?" అన్నాడు కాస్త నిష్ఠూరంగా రాజలింగం.

"ఏదండీ, తీరిక దొరక్క, రేపాదివారం వద్దామనుకుంటున్నాను."

"నాకే చూడాలనిపించింది, వచ్చేశాను" అన్నాడు రాజలింగం గ్లాసు కిందపెడుతూ. గ్లాసు తీస్తున్న జానకమ్మ నుద్దేశించి, "ఒకసారి మా యింటికి రాకూడదమ్మా? వస్తూ పోతూ వుంటేనే స్నేహాలైనా, పరిచయాలైనాను" అన్నాడు రాజలింగం.

జానకమ్మకి ఎక్కడికో ఎత్తుగా ఎగిరిపోయినట్లనిపించింది. మేరు పర్వతం చీమలపుట్టముందు నిలబడి స్నేహానికి చేయి చాచినట్లు అనిపించిందామెకి.

'నూలు మిల్లొకటి నాలుగేళ్ళకి లీజ్‌కి తీసుకుందామనుకుంటున్నాను. మాటలన్నీ జరిగాయి, నిన్నుకూడా వాటాదారుడుగా చేర్చుకోవాలనిపించింది.'

'అయ్యబాబోయ్. అంత తూగగలనా బాబూ! నేను?'

'నే లేనా? నువ్వు పట్టిందల్లా బంగారమే రామదాసూ. అందుకే నేనే స్వయంగా వచ్చాను. నాలుగేళ్ళకి రెండు లక్షలు కట్టాలి మనం ముందుగానే. నాలుగేళ్ళు గడిచేసరికి నాలుగు లక్షలకి మరో నాలుగు లక్షలు చలాగ్గా చేసుకోవచ్చు.'

'కాని, అంత డబ్బు.'

'నీ దగ్గర ఎంతుందయ్యా?'

'ఏదండీ. వున్నదంతా ఆ షాపుమీదే పెట్టాను. మహా వుంటే ఇరవై వేలు తప్పితే పాతిక. ఆ డబ్బు షాపులోంచి తీసేసినా టర్నోవర్ కష్టమౌతుంది మళ్ళీ.'

'భలేవాడివయ్యా! అవసరమైతే నే లేనటయ్యా. ఇరవై వేలు నువ్వు పెట్టు. మరో ఎనభై వేలు మా అబ్బాయి కట్నం తాలూకుసొమ్ము వుంది. అది నోటుమీద నీ కిస్తాను. అక్కడికి నీది పావలా వాటా, నాది మూడు పావలాల వాటా.'

'కాని, నాకారంగంలో ఏమీ తెలియదు కదండీ?' అన్నాడు రామదాసు.

'నాకు మాత్రం తెలుసు. చూసుకునేవాళ్ళు చూసుకుంటారు. నువ్వు నీ షాపు, నేను నా షాపు వదలిపోనక్కరలేదు. మిగిలిన ఏర్పాట్లు అన్నీ నే చేస్తాగా? అది కాకపోయినా, పిల్లలు ఎదుగుతున్నారా. ఒక్క బట్టలషాపు ఏ మూలకయ్యా. ఎన్నాళ్ళీ అద్దె కొంపల్లో వుండటం ? నా అంతటి వాడివి నువ్వు కావాలని నా ఆశ' అన్నాడు.

జానకమ్మ ఇంక ఉండబట్టలేకపోయింది. 'సిరి యింటి కొస్తూంటే మోకాలడ్డెడతా రేమిటి? ఆయనంతగా చెబుతూంటే, వడ్డి నోటుమీద ఎనభై వేలు ఇస్తానంటూంటే కాదంటారేం? ఎవరండీ అంత సహాయం

చేసే వారీ రోజుల్లో! బాబుగారు చెప్పినట్టు చెయ్యండి ఇంక అడ్డుపడక' అని సమస్యని చిటికెలో తేల్చేసింది జానకమ్మ.

'చక్కగా చెప్పావమ్మా. ఇప్పుడర్థ మవుతోంది. మా రామదాసు అదృష్టమంతా అతనిది కాదూ నీదీ అని. రేపు సాయంత్రం షాపుకి రా. అక్కడినుంచి యింటికెళ్ళి అన్ని విషయాలు మాట్లాడుకుందాం' అని చెప్పి వెళ్ళిపోయాడు రాజలింగం.

రాజలింగం ఎనభై వేలకి రామదాసుచేత నోటు వ్రాయించుకొని నూలు మిల్లులో వాటా యిచ్చాడు. రామదాసు తన దగ్గరున్న ఇరవై వేలూ రాజలింగానికి ఇచ్చాడు.

నూలు మిల్లు నడుస్తూంది. మొదటి సంవత్సరం రామదాసు వాటాకి ఎనభై వేల అప్పుకి వడ్డీ పోను పదివేలు లాభం వచ్చింది. జానకమ్మ సంతోషానికి అవధులు లేవు. రోజులు గడుస్తున్నాయి. రామదాసుకి మిల్లు వ్యవహారాలు పట్టించుకునే టైములేదు. అందులో అతనికి అనుభవమూ లేదు. అందుకే అతను మిల్లువైపే పోలేదు. ఏదో మిషనరీ చెడిపోయి, కూలీల గొడవల మూలంగానూ రెండేళ్ళు మూతపడింది. రామదాసుకి కంగారు పుట్టింది. రాజలింగం ధైర్యం చెప్పాడు. నాలుగో సంవత్సరం కూడా గడిచింది. నాలుగో సంవత్సరం చివర స్టాక్సు గోడౌన్ కాలిపోయింది. నాలుగేళ్ళ తరువాత లెక్కలు చూసుకున్నారు.

రామదాసు తను పెట్టిన లక్ష పోను పాతిక వేలు ఇవ్వాలేలాడు. గుండె ఆగిపోయినంత పనయింది.

'ఏం చేస్తావు మరి?' అన్నాడు రాజలింగం.

'ఏం చెయ్యమంటారు?' అన్నాడు రామదాసు నిర్లిప్తంగా.

'సరే, అబ్బాయికి నీ షాపు రాసి ఇచ్చేయ్ ఎనభై వేలకీను. ఆ మిగిలిన పై పాతికవేలు నే కడతానులే. రేపటినుంచి షాపు కొచ్చి నీ

మామూలు పని నువ్వు చేసుకో. నీకూ నాకూ ఈ దండా గొండీ తప్పదు' అన్నాడు రాజలింగం.

రామదాసు 'చిత్తం' అని మాత్రం అనగలిగాడు.

జానకమ్మ ఇంటికి వచ్చిన రామదాసుని చూసి నోరూ నెత్తీ బాదు కుంది.

'ఎందుకే ఏడుస్తావ్? చిన్న చేపను పెద్ద చేప వెంటాడి వేటాడు తుంటే. పెద్దపులి కుందేలుని పేరంటానికి పిలిస్తే కుందేలు భుజా లెగ రేసుకొని వెడితే, దాన్ని పెద్దపులి తాంబూలం వేసుకుంటుందిగాని తిరిగి రానిస్తుందటే పిచ్చిదానా?' అన్నాడు రామదాసు జానకమ్మతో వోదార్పుగా.

'మర్రిచెట్టు కింద మాను కట్టి మర్రిచెట్టునే తల దన్నాలను కున్నాడు, మళ్ళీ ఆ నీడనే రాలిపోయాడు' అనుకున్నాడు రాజలింగం.

'బలవంతమైన సర్పము చలిచీమలచేత చచ్చె' అని పద్యం చదువుతున్నాడు రామదాసు. అదే పద్యం నెమరువేసుకుంటూ పాత ఉద్యోగానికి రాజలింగం కొట్లో గుమాస్తాగా బయలుదేరాడు.